

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో రైతులు విక్రయించే ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టెక్కలి ఆర్‌డిఒ ఎన్.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని వాండ్రాడలో రైతులు విక్రయించే ధాన్యాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ వరి సాగు సక్రమంగా, నాణ్యమైన పంట పండిందని, దీనికి వాతావారణం కూడా సహకరించిందన్నారు. అందుకే రైతులు ధాన్యంలో ఎటువంటి తేమ లేకుండా ఎండబెట్టి విక్రయించాలని సూచించారు. అలాగే పంట దిగుబడి, తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు అదే పంచాయతీ నర్సింగపల్లిలో ల్యాండ్ కన్వర్షన్లను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పూరిళ్లకూ బిల్లుల మోత

- నవంబరుతో పోలిస్తే రెట్టింపైన ఛార్జీలు
- కూలి చేసుకునే పేదలకు అధిక మొత్తంలో బిల్లులు
- బిల్లులు చూసి నమ్మలేకపోతున్న నిరుపేదలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కొత్తూరు, ఎచ్చెర్ల

టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) ఛార్జీలు అన్ని కేటగిరీ వినియోగదారులకు పెనుభారంగా మారాయి. డిసెంబరులో భారీ మొత్తాలతో వస్తున్న బిల్లులు చూసి షాక్ అవుతున్నారు. కరెంట్ వాడకం తగ్గినా సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో అధిక బిల్లులు రావడంతో నిర్ఘాంతపోతున్నారు. ముఖ్యంగా కూలి నాలి చేసుకుని బతికే నిరుపేదలకు మరింత ఆర్థిక భారంగా మారాయి. చిన్నపాటి ఇంటిలో అద్దెకు ఉంటున్న అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించలేక సతమతమవతున్నారు. పురిళ్లలో ఉంటున్న వారికి సైతం అధిక బిల్లులు రావడంతో షాక్ అవుతున్నారు.

ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం పురానికి చెందిన లక్ష్మి నిరుపేద. భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో కలిసి కూలి చేసుకుని బతుకుతోంది. ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు అనిల్‌కు రెండు కళ్లూ కనిపించవు. పెద్ద కుమారుడు అర్జున్ ట్రిపుల్ ఐటి కళాశాలలో కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. పూరిగుడిసెలో నివాసముంటున్న ఈమెకు డిసెంబరు (సర్వీస్ నంబరు 131203ఐ432000476) బిల్లు రూ.361.49 వచ్చింది. ఈమె 41 యూనిట్ల కరెంటే వినియోగించింది. అందుకుగానూ రూ.64.68 బిల్లు రావాలి. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఎఫ్‌పిపిపిసిఎ-1 ఛార్జీ రూ.45.25, వైసిపి ప్రభుత్వం గతంలో విధించిన ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీ రూ.16, ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీలు రూ.25 ఇలా అన్నిరకాల ఛార్జీలు కలిపి రూ.361.49 బిల్లు వచ్చింది. నవంబరులో 46 యూనిట్లు వాడగా రూ.184.07 బిల్లు జారీ చేశారు. డిసెంబరులో అదనంగా రూ.177.42 అదనంగా చెల్లించాల్సి రావడంతో ఏం చేయాలో ఆమెకు పాలుపోవడం లేదు.



ఎచ్చెర్ల : పూరిల్లుకు అధిక బిల్లు వచ్చిందని చెప్తున్న లక్ష్మి

నిరుపేదలపై భారం

కొత్తూరులోని బిసి కాలనీ చెందిన దంత లక్ష్మి (సర్వీస్ నంబరు 133509డి001003027)కి ఈనెల రూ.814 బిల్లు వచ్చింది. గత నెల రూ.614 వచ్చింది. ఈమె భర్త దంత కృష్ణ భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఇద్దరు కుమారులు చదువుకుంటున్నారు. భవన నిర్మాణ కూలి డబ్బుల మీదే బతుకుతున్న వీరికి అధికంగా బిల్లు రావడంతో ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అమలు చేసిన ఎఫ్‌పిపిపిసిఎ-1 ఛార్జీ రూ.36.25, వైసిపి ప్రభుత్వం గతంలో విధించిన ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీ రూ.18, ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10, కస్టమర్ ఛార్జీలు రూ.25 ఇలా అన్నిరకాల ఛార్జీలు కలిపి ఈనెల రూ.814 బిల్లు వచ్చింది. గత నెలతో పోల్చితే ఈనెల అదనంగా రూ.123 బిల్లు వచ్చింది.

బలవంతపు భూసేకరణ వద్దు

వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - మందస

మందస, వజ్రపుకొత్తూరు మండలాల తీర ప్రాంత భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న బలవంతపు భూసేకరణను రద్దు చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత వంకులూరు, బిడిమి, రాంపురం, గంగువాడ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో వామపక్ష నాయకులు గురువారం పర్యటించి రైతుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని ప్రచారం చేస్తూ గ్రామాల్లో ప్రదర్శనలు, సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని విమర్శించారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్‌కు ప్రభుత్వం 2020 ఎకరాల భూమిని ఇస్తే, ఆ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాళా పిటిషన్ వేసిందని గుర్తుచేశారు. దీంతో ప్రభుత్వం ఆక్షన్ వేసి లాజిస్టిక్ కంపెనీకి రూ.26 కోట్లకు కారుచౌకగా కట్టబెట్టిందని విమర్శించారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల ప్రజల జీవన విధానం ధ్వంసమైపోతోందన్నారు. జిల్లా సస్యశ్యామలం కావాలంటే వంశధార ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.వెయ్యి కోట్లు కేటాయించి, చివర భూముల వరకు నీరందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ఏడాదిలో రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగుతుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెరిగి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం కోరుకుంటోంది కార్పొరేట్ అభివృద్ధా?, ప్రజల అభివృద్ధా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అదానీప్రదేశ్‌గా మార్చేస్తోందని విమర్శించారు. కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వేణు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు జి.బాలకృష్ణ, జె.వీరస్వామి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన రావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, పలు ప్రజాసంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, సార జగన్, రాపాక మాధవరావు, బర్ల గోపి, పిడియస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణను రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న స్థానికులు, వామపక్షాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రేషన్ పంపిణీలో జాప్యం వద్దు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీని వేగవంతం చేసి, అర్హులైన తెల్ల రేషన్‌కార్డుదారులకు సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు, వేర్ హౌసింగ్ గోడౌన్ ఇన్‌ఛార్జీలతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బియ్యం పంపిణీలో ఎటువంటి సాంకేతికపరమైన సమస్యలు ఉన్నా, వెంటనే పరిష్కరించి బియ్యం పంపిణీకి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్డుదారుల ఇళ్ల వద్దకు బియ్యం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న ఫిర్యాదు ఒక్కటీ లేకుండా పనిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాలకు సైతం రేషన్‌ను సకాలంలో అందాలని చెప్పారు. సమావేశంలో సిఎస్‌డిటిలు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ టి.వేణుగోపాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి గురువారం వినతులను స్వీకరించారు. నగర పరిధిలోని పలు డివిజన్ల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. వీటిపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సుపరిపాలన అందిస్తామన్నారు.



సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాయకులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన మండల కేంద్రంలోని రామతీర్థం రోడ్డులో గురువారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీతో జరిగిన అన్నిరకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని, ఆ నేతలు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. అదానీ, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కై రూ.వేలాది కోట్ల అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టడం నమ్మకద్రోహమే అన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పడుతోందన్నారు. ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. మరోవైపు ప్రతి మీటరుకు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుంచే వసూలు చేస్తారని చెప్పారు. మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రివేళల్లో అధిక రేట్లు వసూలు చేసి నడ్డి విరిచే చర్యలకు పాల్పడుతోందన్నారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసిపి, నేడు టిడిపి, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం గర్హనీయమన్నారు. ట్రూఅప్ ఛార్జీలు విధించి మరోవైపు స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించడం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీల అంశంపై వైసిపి దారిలోనే టిడిపి కూటమి ప్రభుత్వం పయనిస్తోందన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో జిల్లాలోని న్యాయమూర్తులతో గురువారం వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పనిభారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి ఇదో మార్గమన్నారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థికి మృతికి ప్రేమ వ్యవహారమే...

డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి విద్యార్థి రమావత్ ప్రవీణ్ నాయక్ మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని డిఎస్‌పి వివేకానంద తెలిపారు. నగరంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి ఆర్‌జియుకెటి (ట్రిపుల్ ఐటి)లో 2022లో ప్రవేశం పొంది పియుసి పూర్తి చేశాడని, తర్వాత బిటెక్ ప్రథమ సంవత్సరానికి ప్రమోట్ అయ్యాడని చెప్పారు. బాయ్స్ హాస్టల్‌లో మూడో అంతస్తులో రూమ్ నంబరు 24లో మరో ఆరుగురు విద్యార్థులతో కలిసి ఉంటున్నాడని తెలిపారు. అదే కళాశాలలో మొదటి సంవత్సరం బిటెక్ చదవుతున్న ఓ విద్యార్థినితో తన ప్రేమను వ్యక్తపరచగా, ఆమె తిరస్కరించి స్నేహితులుగా ఉందామని చెప్పిందన్నారు. దీంతో సున్నిత మనస్తత్వం కలిగిన ప్రవీణ్ నాయక్ మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటి కేర్ టేకర్‌గా ఉన్న సింగలూరు శాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో భాగంగా కళాశాలను సందర్శించి వివరాలు సేకరించామని చెప్పారు. కళాశాలలో సి-షిఫ్ట్‌లో ఉన్న కె.రమణమూర్తి రాత్రి 12 గంటల వరకు రౌండ్స్ తిరిగి మొదటి అంతస్తులోని విశ్రాంతి గదిలో ఉన్నారని తెలిపారు. 1.30 గంటల సమయంలో విద్యార్థులు జిపి రుత్విక్ రాజ్, రాహుల్ రాయ్ పోలియత్ వచ్చి ఎవరో హాస్టల్ విద్యార్థి భవనంపై నుంచి పడిపోయారని రమణమూర్తికి చెప్పినట్లు వివరించారు. ఆయన వెళ్లి చూడగా అదే కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంకు చెందిన రమావత్ ప్రవీణ్ నాయక్‌గా గుర్తించారని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్‌ను వెంటనే కళాశాల అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారని, 2.30 గంటలకు విద్యార్థి మరణించినట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. సమావేశంలో జె.ఆర్ పురం సిఐ అవతారం పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద



సీజ్ చేసిన ట్రాక్టర్లు

14 ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలంలోని తమ్మినాయుడుపేట నుంచి ఇసుకను తలిస్తున్న 14 ట్రాక్టర్లను జాతీయ రహదారిపై ఎచ్చెర్ల పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గురువారం సీజ్ చేశారు. నాగావళి నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తరలించి హైవే సమీపంలో డంప్ చేస్తూ విశాఖకు లారీల్లో అక్రమంగా ఎగుమతి చేస్తున్నారు. రెండు నెలలుగా ఇసుకను తోడేస్తూ సమీప ప్రాంతాల ప్రజల అవసరాలకు ఇసుక ఇవ్వకుండా అడ్డుకుంటున్న తమ్మినాయుడుపేట ఇసుక మాఫియాపై సిఎం కార్యాలయానికి స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ట్రాక్టర్లతో ఇసుక తరలించుకోవచ్చంటూ సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారని రెవెన్యూ అధికారులు, పోలీసులతో ట్రాక్టర్ల యజమానులు వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్లను అడ్డుకొని ప్రభుత్వ సూచనలను పోలీసులు, రెవెన్యూ అధికారులు ధిక్కరించారని ఇసుకను తరలిస్తున్న వారు ఆందోళనకు దిగారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది చర్యలకు అడ్డుతగులుతూ ఆందోళన చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఇసుక ర్యాంపునకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే ఇసుకను ఎలా తరలిస్తారని మైన్స్ అధికారులు ట్రాక్టర్ల యజమానులను ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నందున ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నట్లు తహశీల్దార్ ఎ.సింహాచలం స్పష్టం చేశారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటున్నారని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న బస్సును నగరంలోని డచ్ బంగ్లా వద్ద గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంటరీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ సేవలను వేగవంతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతు ఉత్పత్తి సంస్థ ప్రతినిధులు, అభ్యుదయ రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ఐదు బృందాలను పంపించినట్లు తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ఫిబ్రవరి నెలాఖరు వరకు పశుగణన

పశుసంవర్ధశాఖ జెడి మురళీధర్

ప్రజాశక్తి- మందస

ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహిస్తున్నామని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మురళీధర్ అన్నారు. మందస పశువైద్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పశుగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న అఖిల భారత పశుగణను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, కోళ్లు, బాతులు ఇలాంటి 16 రకాల జాతులకు సంబంధించిన పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తారని అన్నారు. జిల్లాలో 222 ఎన్యూరేటర్లు 1586 గ్రామాల్లో 5,88,090 కుటుంబాలకు పశుగణన చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,95,786 కుటుంబాల్లో పశుగణన చేశామని తెలిపారు. పాడి రైతులు పశుగణన చేసే సిబ్బందికి సహకరించి మీ పశువుల పూర్తి సమాచారం అందిస్తే ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాల రూపాకల్పనకు, పశువులకు టీకాలు వేయడం వీలవుతుందనిఅన్నారు. బహువార్షిక పశుగ్రాసం సాగు చేసే రైతులకు ప్రభుత్వం సహకారం అందించాలని నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 10 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసే రైతుకు రూ.6599, 50 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసే రైతుకు రూ.32,992 చొప్పున ఉపాధి నిధులు చెల్లిస్తుందని చెప్పారు. ఉపాధి హామీ ద్వారా నిర్మిస్తున్న మినీ గోకుల షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణన పర్యవేక్షణ అధికారి డాక్టర్ జి.నారాయణరావు, పలాస ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు, మందస పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, సిబ్బంది ధనుంజయరావు, కూర్మారావు, నేతాజీ, ఇంతియాజ్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జెడి మురళీధర్


విచారణ చేస్తున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా

దాడి ఘటనపై జెడ్‌పి సిఇఒ విచారణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపి సచివాలయంలో ఇటీవల విఆర్‌ఒ దేవాకర్ (రేవతిరావు)పై ఎంపిటిసి భర్త పప్పుల రామినాయుడు దాడి చేసి కార్యాలయంలో కంప్యూటర్‌లు ధ్వంసం చేసిన ఘటనపై గురువారం జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా విచారణ చేపట్టారు. ఈ నెల 3న సచివాలయంలో జరిగిన ఘటనపై కలెక్టర్ సంపూర్ణ నివేదిక కోరారు. దీనిపై ఇప్పటికే ఎంపిడిఒ మీసాల మన్మథరావు విచారణ జరిపి నివేదికను సమర్పించారు. ఈ నివేదికపై సంతృప్తి చెందని కలెక్టర్ మరోసారి సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జెడ్‌పి సిఇఒను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో కార్యాలయంలో విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది సమక్షంలో విచారణ జరిపారు. ఈ విచారణలో తహశీల్దార్ వెంకటేష్ రామనుజులు, ఎంపిడిఒ మన్మథరావు, సచివాలయ కార్యదర్శి వినోద్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జాకీ షోరూం ప్రారంభం

శ్రీకాకుళం : వస్త్ర రంగంలోని ప్రముఖ బ్రాండ్స్‌లో కింగ్ జాకీకి ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జిటి రోడ్డులో జాకీ షోరూమ్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాకీ అంతర్జాతీయ బ్రాండ్ అని, పురుషులు, మహిళలు, పిల్లల కోసం అన్ని రకాల లోదుస్తులు, స్లీప్‌వేర్, క్రీడా దుస్తులను తయారు చేస్తుందన్నారు. ప్రఖ్యాత బ్యాండ్ జాకీకి ప్రజల నుంచి ప్రత్యేక ఆదరణ ఉందని తెలిపారు. శ్రీకాకుళం వంటి చిన్న పట్టణాల్లోనూ ఇటువంటి బ్రాండెండ్ షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కోటబొమ్మాళి: టిడిపి కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. మండలంలోని నిమ్మాడ పంచాయతీ తులసిపేటలో పలు రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎక్కడా రోడ్లు, డ్రెయినేజీలు వేసిన పాపానపోలేదని ఆరోపించారు. దీంతో గ్రామాల అభివృద్ధి కుంటిపడిందన్నారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయిజీలు నిర్మించి అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న హరివరప్రసాద్

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

ప్రజాశక్తి- లావేరు

భూ సమస్యలను శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహశీల్దార్ వై.జోగారావు అన్నారు. గురువారం లోపెంట గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. పలువురు రైతుల నుంచి భూసమస్యలపై తహశీల్దార్ ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలపై రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వీటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిటి తిరుపతిరావు, మండల సర్వేయర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ పైడియ్య, విఆర్‌ఒ మల్లేశ్వరరావు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ మురళీమోహన్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులు వినియోగించుకుని, తమ భూ సంబంధ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మ్యూటేషన్లకు సంబంధించి వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎస్.పి. నారాయణ స్వామి, దూగాన భద్రాచలం, నాయకులు బెందాళం రమేష్, పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, పండి దేవేంద్రమూర్తి, బార్ల చినబాబు, డిటి కృష్ణమూర్తి, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున పానిగ్రాహి, విఆర్‌ఒ గిరిబాబు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : మాట్లాడుతున్న తహశీల్దార్ పాపారావు


కవిటి : మాట్లాడుతున్న తహశీల్దార్ మురళీమోహన్

మెళియాపుట్టి : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ బడే పాపారావు అన్నారు. మండలంలోని సుజ్జిని, జాడుపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22ఎ, డీకేట్, రీ సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు జగన్మోహనరావు, టిడిపి నాయకులు ఖగేశ్వరరావు పాల్గొన్నారు.


కోతకు గురైన సింగూరు రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

కోతకు గురైన రహదారి పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

అధికారుల నిర్లక్ష్యం సింగూరు రహదారి పాలిట శాపంగా మారింది. మూడు నెలల క్రితం వరదలతో కోతకు గురైన సింగూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలమయ్యే పరిస్థితికి వచ్చింది. ఇదే జరిగితే సింగూరు గ్రామానికి రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. గతంలో కొద్దిగా కోతకు గురైనప్పుడు పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిర్లక్ష్యంగా విడిచిపెట్టడంతో ఇప్పుడు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం రెల్లిగడ్డకు ఆనుకొని ఉన్న ఈ రహదారి పూర్తిగా కొట్టుకుపోయి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రహదారి దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి స్థానిక టిడిపి నాయకులు జగన్మోహనరావు, గణపతి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశించడంతో పంచాయతీ రాజ్ శాఖ డిఇఇ చంద్రశేఖర్ రహదారిని పరిశీలించారు. తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలంటూ అధికారులను స్థానిక నాయకులతో పాటు గ్రామస్తులు కోరారు.

భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి

పొందూరు: వికలాంగ చిన్నారుల తల్లిదండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఎన్.అమ్మినాయుడు అన్నారు. స్థానిక భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో ఎన్రోల్మెంట్, విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. అలాగే ఇంక్లూజివ్ ఆక్టివిటీస్, యు డైస్‌లో వివరాల నమోదు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ఎంఇఒ-2 పట్నాన రాజరావు, ఐఇఆర్‌టిలు దినేష్, రాధారాణి పాల్గొన్నారు.

నివగాం ఆర్‌టిసి కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాంలో ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్ లీజును తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం 1995లో 27 సెంట్లలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మించారని అన్నారు. ప్రస్తుతం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను వచ్చే పదేళ్ల వరకు ఆర్‌టిసి అధికారులు లీజుకు ఇచ్చారని, సంబంధిత వ్యక్తి ఐస్ ఫ్యాక్టరీ కోసం మొత్తం మూసేశారని అన్నారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు నిల్చోవడానికి, కూర్చోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు, ప్రయాణికులు వందలాది మంది వస్తూ... పోతూ ఉంటారని అన్నారు. కొత్తూరు నుంచి పలాస, పలాస నుంచి మాతల వరకు బస్సులు నడుపుతున్నారని అన్నారు. ప్రయివేటు బస్సులు, ఒడిశా ఆర్‌టిసి బస్సులు వస్తుంటాయని, ఇంత రద్దీగా ఉండే కాంప్లెక్స్‌లో ప్రయాణికులు, విద్యార్థులు ఉండే విధంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేవారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, లోపింటి చిన్నారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడు తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ కోసం వినియోగించే నూతన ఫాగింగ్ యంత్రాలు, స్ప్రేయర్లను ప్రారంభించారు. పురపాలక సంఘంలోని ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు, దోమల నివారణ కోసం రెండు ఫాగింగ్ మిషన్లు, ఏడు స్ప్రేయర్‌లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్వచ్ఛ ఆమదాలవలసగా తయారు చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి పరిసరాల పరిశుభ్రతను కొనసాగించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.


ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పురపాలక సంఘంలో ఇటీవలే మురుగు కాలువల్లో నిల్వ ఉన్న పూడికలను ప్రత్యేక నిధులు మంజూరు చేసి తొలగించామన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడాలన్నా, పట్టణం సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మేనేజర్ బిసాయ్, పివివికె రాజు, చక్రవర్తి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి- నందిగాం


చైతన్య (ఫైల్)

మండలం కాపు తెంబూరు గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుంగాన చైతన్య (30) ఈ నెల 10న విధులు ముగించుకుని తమ స్వగ్రామమైన పాత్రునివలస బైక్‌పై వెళ్తున్నాడు. కూడలి వద్ద వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొనడంతో ఇతని తలకి తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రాస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ పట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతునికి భార్య అమృత వర్షిని, తల్లిదండ్రులు కృష్ణవేణి కేశవరావు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు చేరు.ు నందిగామ ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ దర్యాప్తు చేస్తున్నారు.


దగ్ధమైన సామగ్రి

ఆటో గ్యారేజ్ దగ్ధం

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రమైన పాలకొండ రోడ్డులో పైల భాస్కరరావు చెందిన విజయ దర్గ ఆటో గ్యారేజ్ బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తులు స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. అగ్నిమాక అధికారి ఎన్.బుచ్చోడు, సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేసింది. రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని షాపు యజమాని భాస్కరరావు తెలిపారు. ఈ ప్రమాదంలో స్పేర్స్ పార్టులు, 21 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయని యజమాని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

వ్యక్తికి జైలుశిక్ష

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దల్లవలస గ్రామం కొంచాడ సూర్యంకు చెందిన ద్విచక్రవాహనం గత నెల 5న చోరీ చేసిన కేసులో శ్రీకాకుళం మంగువారి తోటకు చెందిన బొమ్మలాట మోహనరావుకు జైలు శిక్ష విధిస్తూ స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి గురువారం తీర్పునిచ్చారని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు నేరం అంగీకరించిన ముద్దాయికి ఏడాదిపాటు శిక్షతోపాటు రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ముద్దాయి జరిమానా రూ. 2 వేలు చెల్లించని యెడల మరో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చినట్లు తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని తిడ్డిమిలో ఆరు మద్యం సీసాలు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


జాబితాను ఎంపిడిఒకు అందజేస్తున్న కార్యదర్శులు

కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పొందూరు

మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా ఇఒ కె.మోహన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా పి.జగదీష్, ఉపాధ్యక్షులుగా పైల శ్రీరాములు, రుద్రవేణి, కోశాధికారిలుగా జి.శ్రీనురెడ్డి, వై.విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. కార్యవర్గం జాబితాను ఎంపిడిఒ మన్మథరావుకు అందించారు.

కొడుకు చితికి తల్లి తలకొరివి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైల్వేస్టేషన్ రోడ్డు చక్రపాణి వీధికి చెందిన లక్ష్మీరెడ్డి రాజు (33) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య రోజా, సిరి (11), ఓంకార్ (5), తల్లి రమ ఉన్నారు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందడం, చిన్న పిల్లలు కావడంతో తల్లి రమ శ్మశానంలో గురువారం ఉదయం కొడుకు చితికి తలకొరివి పెట్టింది. పేద కుటుంబానికి చెందిన రాజు గత నాలుగేళ్లుగా స్థానిక మెయిన్ రోడ్డులో సూరంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా చిన్నపాటి చికెన్ సెంటర్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అందరితో కలివిడిగా ఉండే రాజు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది.

అభివృద్ధికి సైనికోద్యోగుల తోడ్పాటు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులైన సైనిక ఉద్యోగులు తమ తోడ్పాటును అందజేశారు. పూర్వ విద్యార్థులైన బి.కామరాజు, కె.దుర్యోధన, బి.రామారావు, బి.పవన్, బి.జీవంరావు, బి.రమేష్ బాబు తదితరులు ఆర్థికసాయం అందజేశారు. దీంతో పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సోంపేట సిఐ మంగరాజు, ఎంఇఒలు శివరాం ప్రసాద్ చిట్టి బాబు గురువారం విగ్రహాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా హెచ్ఎం మడ్డు తిరుపతిరావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులతో పాటు పూర్వ విద్యార్థులు చేయూత అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉప్పరిపేట, చిలకల మెట్ట, జలంత్రకోట పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపికి చిమ్నీ సామ్రాట్ పురస్కారం

ప్రజాశక్తి- కవిటి


మొర్రి గోపి

అలతి పదాలతో అనంత భావాలు పలికించే లఘు కవిత చిమ్నీ ప్రక్రియలో 1200 చిమ్నీలు పూర్తిచేసిన కవిటి మండల ఉపాధ్యాయుడు మొర్రి గోపి 'చిమ్నీ సామ్రాట్ పురస్కారం' అందుకున్నారు. ఈ మేరకు హంసవాహిని సాహిత్య కళా పీఠం, నిర్మల్ జిల్లా తెలంగాణ రాష్ట్రం ఈ పురస్కారాన్ని అందించారు. మొర్రి గోపి గత నాలుగేళ్లుగా ఈ ప్రక్రియలో రోజూ లఘు కవితలు రాస్తూ 1200 చిమ్నీలు పూర్తిచేసిన సందర్భంగా హంస వాహిని సాహిత్య కళాపీఠం ప్రధాన కార్యదర్శి పీసర శ్రీనివాస్ గౌడ్, న్యాయ నిర్ణేతలు జాగిరి యాదగిరి, బసవరాజు, గౌడ సరిత, మక్కువ అరుణకుమారి, పసుల శంకర్, శనిగరపు రాజమోహన్, రాజోలి వరలక్ష్మి అభినందనలు తెలియజేశారు. అలాగే గోపికి కవిటి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట ప్రధానోపాధ్యాయురాలు జి.శాంతి, మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, త్రిలోచన, కొత్తపల్లి రంగారావు, బల్ల ధర్మారావు, శమల్ల రాజబాబు, శ్రీరామ్మూర్తి, హిమకుమార్, జి.జానకిరావు, వంశీ, కింజరాపు రామకృష్ణ, నాగేశ్వరరావు, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘ ప్రతినిధులు ఆరంగి మధు, బెందాళం రమేష్, పాండవ చంద్రశేఖర్, ఆరంగి త్రివిక్రమరావు, తమరాల జయరాం అభినందించారు.

పాఠశాల భవనాల నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బెండికొండ వద్ద అధికారులు గుర్తించిన స్థలంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నూతన భవనాలను నిర్మాణానికి కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. అక్కుపల్లి-బైపల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను గురువారం సందర్శించి తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాల వసతులు, భోజనం, విద్యా బోధన ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఐదు నుంచి పదో తరగతి వరకు 188 మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. విద్యార్థులకు సరిపడ పక్కా భవనాలు లేక ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు పాఠశాలను పరిశీలించామని తెలిపారు. అయితే గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలను నిర్మించలేదని, దీంతో పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కూటమీ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ విషయాలను స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, సంబంధిత మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఆయనతో పాటు అర్జీ తులసీరావు, నాగేశ్వరరావు, సాయికుమార్ ఉన్నారు.


తరగతి గదులను పరిశీలిస్తున్న దుర్గారావు

చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం


బూర్జ : చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ రమణారావు

ప్రజాశక్తి- బూర్జ

చెత్త సంపద కేంద్రాలతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డిఎల్‌పిఒ బి.వి రమణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాల ద్వారా తయారు చేసిన ఎరువులు సేంద్రియ ఎరువులుగా ఉపయోగ పడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను ఒకచోట చేర్చి స్వచ్ఛతను పెంపొందించడమే కాకుండా దాని ద్వారా ఎరువులుగా మార్చి ఆయా పంచాయతీలకు ఆదాయాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను పాటిస్తే పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, కార్యదర్శి కిరణ్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని నడసంద్రంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా గురువారం పర్యటించారు. పారిశుధ్యంలో భాగంగా గ్రామంలోని డ్రెయినేజీలను పరిశీలించారు. అలాగే చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ డిఇ, ఎఇలతో పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ రాజేశ్వరి సీనియర్ సహాయకులులు నారాయణరావు, శాంతమ్మ, లింగరాజు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆమదాలవలస అర్బన్, రూరల్, సరుబుజ్జిలి, పొందూరు మండలాల టిడిపి ముఖ్య నాయకులతో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో మండలాల్లోని అన్ని టిసిలను గెలుపొంది సాగునీటి అధ్యక్షులను గెలిపించుకోవాలని ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. టిసిల పరిధిలోని రైతులను కలిసి కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న సేవలను వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాన్ని నాయకులకు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, బోర గోవిందరావు, గొండు రమణ, చేపేన సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

టిడ్కో ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి- పలాస


పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు నిర్మాణం పూర్తయ్యాయి... ఇంకా ఎన్ని నిర్మించాల్సి ఉంది అనే వాటిపై ఆరా తీశారు. కాలనీలో ఇంతవరకు నోచుకోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఇళ్లు నిర్మాణం పూర్తయిన వాటిలో తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని, మిగిలి ఉన్న ఇళ్ల నిర్మాణాలనూ వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఎంఐజి లే అవుట్‌ను పరిశీలించి అక్కడ చేపడుతున్న పనులను గుర్తించి ఆయా పనులూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి: మండలంలోని గురుకుల, నువాగడ ఆశ్రమ, ఇతర పాఠశాలలను ఎంపిడిఒ తిరుపల రావు, ఎంఇఒ శివరాంప్రసాద్, చిట్టిబాబులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా? లేదా? విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కల్పిస్తున్న సౌకర్యాలను ప్రశ్నించి, ఆరా తీశారు. కంచిలి గురుకుల పాఠశాల, నువాగడ ఆశ్రమ పాఠశాల, తుత్తా సాయి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆనందరావు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేయాలని మత్స్యకార సంఘం నాయకులు అంబటి ఆనందరావు కోరారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ విజయభారతిని శ్రీకాకుళం గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించకుండా 1400 ఎకరాల భూముల్లో సర్వే చేపట్టడం ద్వారా పేద రైతులు భూములను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పలాస మున్సిపాలిటీ పరిధిలో వాడబలిజకి చెందిన పిల్లలకు పైచదువుల కోసం అవగాహన కల్పించాలని, అలాగే మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేయాలని కోరారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు


సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లవరాజు

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థి దశలో విద్యార్థులు క్రమశిక్షణతోపాటు కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదువుకోవాలని, చెడు ప్రవర్తన గల వారితో దూరంగా ఉండి డ్రగ్స్, మాదకద్రవ్యాలు జోలికి పోవద్దని సోంపేట ఎస్ఐ లవరాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని మహర్షి విద్యానికేతన్ పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తెలిసీ తెలియని వయసులో చెడు ప్రవర్తన కలిగిన వారితో పరిచయం చేసుకొని మాదకద్రవ్యాలు గంజాయి డ్రగ్స్, మద్యంకు అలవాటు పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. అటువంటి అలవాటు ఉన్న వారికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవిస్తే చట్టపరంగా విధించే చర్యలు కోసం విద్యార్థులకు వివరిస్తూ జైలులో వారి జీవిత పరిస్థితి తెలియపరుస్తూ అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.ఎల్.శకుంతల, కరస్పాండెంట్ కన్న మాస్టర్, ప్రధానోపాధ్యాయుడు తరిణి ప్రసాద్ పండా, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాదకద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని 13వ వార్డు పరిధిలోని ధర్మారావు క్వార్టర్స్‌లోని శ్రీ వెంకటేశ్వర ఐటిఐలోని విద్యార్థులకు జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సంకల్పం పేరిట మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందని అటువంటి


ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యలో చక్కగా రాణించి తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వెంకటేశ్వర ఐటిఐ కరస్పాండెంట్ కూన బోనాలజీరావు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ స్టాల్ అమ్మకాల్లో పాల్గొన్న డిపిఎం రేవతి

ఆర్గానిక్ మేళాలో సిక్కోలు ఉత్పత్తులు

డిపిఎం రేవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కళాశాలలో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో శ్రీకాకుళం జిల్లా నుంచి సహజ సేద్య పద్ధతుల్లో సాగు చేస్తున్న పలు రకాల ఉత్పత్తులను స్టాల్స్‌పెట్టి విక్రయించడం జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి ఆమదాలవలస మండలం చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లువాడ నుంచి బెల్లం, బూర్జ యూనిట్ నుంచి చిరు ధాన్యాలు, పప్పు దినుసులు, ఆర్గానిక్ దేశీ రకాల బియ్యం, అలాగే వివిధ రకాల దేశి ఉత్పత్తుల నుంచి తయారు చేసిన ప్రొడక్ట్స్‌ను స్టాల్స్‌లో పెట్టామన్నారు. ఈ ఆర్గానిక్ మేళా ఈనెల 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, శోభన్, చిన్నమ్మడు, చిరంజీవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

తాగునీటి సమస్య తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, తాగునీటి సమస్య పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక కూటమి కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం పరంగా వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడం మన ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీతంపేటను పారిశ్రామిక హబ్‌గా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది అతి త్వరలో ఇండస్ట్రియల్ మీటింగ్ నిర్వహించి గిరిజనులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నాబార్డ్‌తో చర్చించి పైనాపిల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సీతంపేటలో పెట్టేలా సన్నాహాలు జరుగుతున్నాయి అని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు సవరతోట ముఖలింగం, ఇమరక ప్రసాద్, ఐటిడిపి నియోజవర్గ కోఆర్డినేటర్ విమరక పవన్, బిడ్డిక సోను, ప్రవీణ్, సాయి సంధ్య, సర్పంచ్ నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అంటికొండ, అచ్చిబ, కూరసింగి తదితర గ్రామాల్లో గురువారం స్థానిక తహశీల్దార్ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఎక్కువగా ముటేషన్, పేరు మార్పులు వచ్చాయని అన్నారు. వారసత్వాలు, భూములు మార్చాలని చెప్పారు. ఈ సమస్యలు 45 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపతహశీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలం దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్యతనికీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విహారయాత్రలో 'జ్ఞానభారతి' చిన్నారులు


విహారయాత్రలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టనంలోని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సిఇఒ కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన గురువారం ప్రీ కేజీ నుంచి రెండో తరగతి వరకు చదువుతున్న చిన్నారులకు వినోద, విజ్ఞాన, విహారయాత్రను నిర్వహించారు. పట్టణంలో బెల్లుపడ వద్ద మినీ కైలాసగిరిగా పిలవబడుతున్న శుద్ధికొండ, కనుమ కొండపై విద్యార్థులతో కలిసి ఈ వినోద విజ్ఞాన విహారయాత్రను నిర్వహించారు. విద్యార్థులను జట్లుగా విడదీసి వినోదంతో కూడిన, విజ్ఞానాన్ని అందించే పలు ఆటలను నిర్వహించారు. కొండ ప్రాశస్త్యాన్ని, చరిత్రను వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులు ఎంతో ఆనందంగా గడిపారు. పాటలకు డ్యాన్సులు చేశారు. ఉపాధ్యాయులతో ఆటలు ఆడుకున్నారు. ఉపాధ్యాయులు, చిన్నారుల మధ్య మరింత బంధం పెనవేసుకునే విధంగా జవహర్ ఖాన్ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను, ఆహార పదార్థాలను అందించారు. ఈ యాత్ర విజయవంతంగా ముగియడంతో ఉపాధ్యాయులను జోహార్ ఖాన్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదరపు పరిపాలన అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ కుమార్, మదీనా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. ఇటీవల రష్యాలో గాయపడి స్వగ్రామానికి చేరుకున్న కొమరల్తాడకు జనసేన అధ్యక్షులు చింత మోహనరావును గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. నీలమ్మ కాలనీ, తామాడపేటలో డ్రెయినేజీ సమస్యలతో సతమవుతున్నామని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. అనంతరం సచివాలయం, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అర్జి తులసీరావు, తామాడ లక్ష్మణరావు,


పరామర్శిస్తున్న దుర్గారావు

మండల మహేష్, మాగుబరి బాబూరావు, లిమ్మాడ నాగరాజు, దండుపాటి పవన్‌కుమార్, కోళ్ల కృష్ణారావు, ఉప్పాడ కుమార్, చింత నరసయ్య, తరుణ్ పాల్గొన్నారు.

ముగిసిన వారణాసి ఉత్సవాలు


ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో వారణాసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గజపతి ఉత్సవాలు సందర్భంగా మంగళ, బుధవారాల్లో నిర్వహించిన వారణాసి ఉత్సవాలు ముగిశాయి. మొదటి రోజు జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, రెండో రోజు ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రహి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అతిథులుగా కలెక్టర్ పండా, సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, కాశీనగర్ ఐఐసి సునీల్ కుమార్ బెహరా పాల్గొన్నారు. తిరుపతిరావు మాట్లాడుతూ పట్టణానికి గతంలో వారణాసి అని పేరుండేదని, ఆ పేరుతో ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ఉత్సవాలకు కళా సాంస్కృతులకు పెద్దపీట వేశారని అన్నారు. రూపేష్ కుమార్ పాణిగ్రహి మాట్లాడుతూ కాశీనగర్ సమితి అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం నృత్యంలో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు.



బొంతు కూడలి

బస్సు సౌకర్యం కల్పించరూ...

ప్రజాశక్తి- సారవకోట

మండలంలోని బొంతు కూడలి నుంచి పాతపట్నం మండలం తెంబూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని లంబ, మూగపురం, పెద్ద గుజ్జువాడ, తెంబూరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉండి సమయానికి చేరుకోలేకపోతున్నారు. గతంలో రెండు ప్రయివేటు బస్సులు ఉండేవని, ఇప్పుడు వాటినీ నిలుపుదల చేశారు. దీంతో ఆటోలకు గంటల కొద్దీ ప్రయాణికులు వేచి ఇబ్బంది పడుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి విద్యార్థుల, ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డులో ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పిస్తారని కోరుతున్నారు. ఇప్పటికే బిటి రోడ్డు ప్రభుత్వం నిర్మించింది.

గర్భిణుల వసతిగృహ సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహాన్ని డిఎంహెచ్‌ఒ కె.విజయపార్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి గర్భిణీతో కాసేపు మాట్లాడారు. ఆమెతో పాటు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు


గర్భిణులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ విజయపార్వతి